## క్లుప్తంగా

### 29న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**నల్లగొండ టూటౌన్:** నీలగిరి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం ఈనెల 29న మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### 24న కట్టంగూర్ పశువుల సంత వేలం

**కట్టంగూర్:** 2023– 24 సంవత్సరానికి గాను కట్టంగూర్ పశువుల సంత వేలాన్ని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచ్ చెనగోని సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న సాయంత్రం 5గంటల లోపు పశువుల సంతకు రూ. 2 లక్షలు, తైబజార్‌కు రూ.లక్ష చొప్పున డీడీ తీసి పంచాయతీ కార్యాలయంలో అందించాలని తెలిపారు. తహసీల్దార్ ధ్రువీకరించిన రూ. 5లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని పేర్కొన్నారు.

### ఆకట్టుకున్న వ్యాపార నైపుణ్యాల స్టాల్స్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

**నకిరేకల్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ విద్యా మండలి ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వ్యాపార నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను ఉద్య మిత్ర అభివృద్ధి విభాగం వారు వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఫ్రూట్ సలాడ్, బట్టర్‌మిల్క్, లెమన్ జ్యూస్ వంటి స్టాల్స్ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ స్టాల్స్‌తో వ్యాపార నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, హరిత, హబీబ్, హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, జానయ్య, నర్సింహాచారి, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

**చిట్యాల:** మున్సిపాలిటీ పరిధిలో మైనారిటీల రుణాల మంజూరుగాను మున్సిపల్ కార్యాలయంలో అధికారులు దరఖాస్తుదారులకు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 50 మంది దరఖాస్తుదారుల్లో 44 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, మెప్మా టీఎంసీ ఎస్.సరిత, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

### కనీస వేతనం నిర్ణయించాలి

**నల్లగొండ టౌన్:** పశు మిత్రలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పశుమిత్ర సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవాలకు అనేకరకాల వైద్య సేవలను అందిస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మనిషా, ప్రధాన కార్యదర్శి అండెం సునిత, కొండ శ్రీదేవి, రాధిక, ఎస్‌కె ఆస్మ, మాధవి, భాగ్యవతి పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

**నకిరేకల్:** నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత కలిగిన అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం ఉత్తీర్ణత పొంది ఉండాలని, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ లోపు కళాశాలలో తమ దరఖాస్తులు అందించాలని కోరారు. అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

### పిచ్చుకల సంరక్షణకు పాటుపడాలి



పిచ్చుకల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు

**రామగిరి(నల్లగొండ):** పిచ్చుకల సంరక్షణకు పాటుపడాలని పర్యావరణ ప్రేమికుడు సురేష్‌గుప్తా అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సోమవారం పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పిచ్చుకల సంఖ్య తగ్గుతోందన్నారు. వేసవి సమీపిస్తున్నందున నీరు, ఆహారం కోసం తొట్లను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీను, డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి, వెంకట్‌రెడ్డి, మహేశ్వరి, సరిత, గిరిబాబు, అనిత తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా కురుమర్తి రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కంకరతేలిన కురుమర్తి రోడ్డు



గుంతలమయంగా మారిన రోడ్డు

**కట్టంగూర్:** మండల కేంద్రం నుంచి కురుమర్తి గ్రామానికి వెళ్లే రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నా మరమ్మతులు చేసేవారే కరువయ్యారు. కట్టంగూర్ మండల కేంద్రం నుంచి కురుమర్తి గ్రామానికి 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు విషయంపై కురుమర్తి గ్రామ ప్రజలు, శాలిగౌరారం మండల ప్రజలు పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కురుమర్తికి చెందిన విద్యార్థులు ఆటోల్లో, సైకిళ్లపై కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసేందుకు ఈ దారిగుండా రాకపోకలు నిర్వహిస్తుంటారు. అదే విధంగా అక్కలాయిగూడేనికి ప్రజలు నిత్యం ఈ దారిగుండా మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం వెళ్తుంటారు. అదేవిధంగా శాలిగౌరారం మండలంలోని వల్లాల, ఆకారం, గురజాల, శాలిగౌరారం ప్రజలతో పాటు కట్టంగూర్ మండలంలోని గార్లబాయిగూడెం, తేలువారిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ దారిగుండా మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతల వద్ద ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి. రాత్రి పూట ద్విచక్రవాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**మూలమలుపుల వద్ద పెరిగిన చెట్లు**

మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలో, ఇటుక బట్టీల సమీపంలో, సత్యనారాయణపురం గ్రామశివారులో, కురుమర్తి గ్రామ శివారులో ఉన్న మూల మలుపుల వద్ద చెట్లు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మూల మలుపు వద్ద చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

**రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి**



కురుమర్తి నుంచి కట్టంగూర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఈ దారిగుండా ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– ఇంద్రకంటి సాయికుమార్, కురుమర్తి

# ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



గార్లబాయిగూడెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**కట్టంగూర్:** ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగిఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామంలో ఉన్న బీరప్ప ఆలయంలో, గార్లబాయిగూడెం జీపీ పరిధి తేలువారిగూడెం గ్రామంలో జరిగిన మల్లన్న పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల అభివృద్ధికి గార్లబాయిగూడెంలో రూ.లక్ష, పరడలో బీరప్ప గుడికి రూ.లక్ష చొప్పున విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, సర్పంచ్‌లు పుట్ట సృజన వెంకట్‌రెడ్డి, బోడ సరితయాదగిరి, ఉపసర్పంచ్ ఆవుల సైదులు, మంగదుడ్ల వెంకన్న, వంగూరి సైదులు, వసంత, వెంకన్న, తేలు శంకర్, నాగయ్య, లింగయ్య, సైదులు, వెంకన్న, భద్రయ్య ఉన్నారు.

# ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

**మునుగోడు:** బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మునుగోడులో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అర్హులైన నిరుపేదలకు గృహలక్ష్మి పేరుతో ఇళ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఈ నెల 27 నుంచి రోజుకు 15 గ్రామాల చొప్పున ఆత్మీయ సమ్మేళనాలు చేపట్టి ఏప్రిల్ 24న నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, చండూరు మార్కెట్ వైస్ చైర్మన్ జాజుల అంజయ్యగౌడ్, సర్పంచ్ కంచి జ్యోతి, అనంత లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

**నల్లగొండ టూటౌన్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో నల్లగొండ నియోజకవర్గ నాయకులు సోమవారం నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే పేపర్ లీకేజీ అయిందని, నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, దాసోజు యాదగిరాచారి, పోతెపాక సాంబయ్య, బొజ్జ నాగరాజు, కంకణాల నాగిరెడ్డి, సిద్దు, పాలకూరి రవిగౌడ్, దాసరి సాయి, రావెళ్ల కాశమ్మ, బోగరి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# వర్షంతో పంటలకు తీవ్ర నష్టం

- వడగండ్ల వానకు దెబ్బతిన్న వరిచేలు
- నేలరాలిన నిమ్మకాయలు
- నష్టపోయిన పంట వివరాలు సేకరించిన అధికారులు



సుంకేనేపల్లిలో వరిపంటను ఏఓ గిరిబాబుకు చూపుతున్న రైతులు

**చిట్యాల:** మండలంలోని పెద్దకాపర్తి, వెలిమినేడు, సుంకేనేపల్లి, గుండ్రాంపల్లి గ్రామాల్లో ఆదివారం కురిసిన వడగండ్ల వానతో పొట్టదశలోని వరి చేలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వెలిమినేడులో 200 ఎకరాల్లో, పెద్దకాపర్తి గ్రామంలో 150 ఎకరాల్లో, సుంకేనేపల్లి గ్రామంలో 120 ఎకరాల్లో, గుండ్రాంపల్లి గ్రామాల్లో 100 ఎకరాల్లో పొట్ట ధశలోని వరి చేలు దెబ్బతిన్నాయి. గింజలు నేలరాలాయి. గుండ్రాంపల్లిలో నిమ్మ తోట రైతులకు సైతం తీవ్రం నష్టం జరిగింది.

**అధికారుల పరిశీలన**

కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన వరి, తదితర పంటలను సోమవారం మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పంట నష్టం వివరాలను రైతుల ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఈఏఓ క్రిష్ణకుమారి, వెలిమినేడు సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాపయ్య, సుంకేనేపల్లి ఎంపీటీసీ మర్రి వెంకటేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ, కురుమలకు గొర్రెల పంపిణీ వరం



ఆత్మీయ సమ్మేళనంలో దూదిమెట్ల బాలరాజు

**నకిరేకల్:** గొర్రెల పంపిణీ పథకం యాదవ, కురుమలకు వరం లాంటిందని షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అన్నారు. నకిరేకల్ మండలం మండలాపురం గ్రామంలో పథకం ద్వారా లబ్ధిపొందిన యాదవ, కరుమ కుటుంబాలతో సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మండలాపురం గ్రామంలో 84 మంది లబ్ధిదారులను గొర్రెల పంపిణీ పథకం కింద గుర్తించామని, మొదటి విడతగా 42 మందికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.93,300 సబ్సిడీ అందించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడుగుట్ల లక్ష్మమ్మ, సంఘం ప్రతినిధులు సింహాద్రి, సురేష్, రామయ్య, వెంకటయ్య, రాంరెడ్డి ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న పిల్లి రామరాజు

**కనగల్:** మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన పగిడిమర్రి రామలింగయ్య ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు సోమవారం రామలింగయ్య మృతదేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబానికి రూ.10వేల నగదును అందజేశారు. ఆయన వెంట సింగం రమేష్, సీత నాగరాజు, సింగం సత్తయ్య, యర్రమాద చినవెంకట్‌రెడ్డి, అయితగోని రాజు, ఇటికాల రాము, కందిమళ్ల దుర్గారెడ్డి ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**చిట్యాల:** మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన లోడే అండాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆ గ్రామ బీసీ కాలనీ యూత్ సభ్యులు సేకరించిన రూ.13వేలను సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

### గీత కార్మిక కుటుంబానికి ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ శేఖర్

**శాలిగౌరారం:** మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొమ్మగాని లింగయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని నకిరేకల్ ఎక్సైజ్ సీఐ శేఖర్ సోమవారం పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ వేముల లింగయ్య, మాజీ సర్పంచ్ భూపతి యాదయ్య, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు సైదుల వెంకన్న, రంగు భిక్షం, కప్పల శ్రీనివాస్, సైదుల శ్రీను తదితరులు ఉన్నారు.

### బీజేపీ నాయకుల దీక్ష

**నకిరేకల్:** టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నకిరేకల్‌లో సోమవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, నాయకులు గోలి ప్రభాకర్, మండల వెంకన్న, ప్రభాకర్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, చెరుకు రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం



తుంగతుర్తిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కొండేటి మల్లయ్య

**కేతేపల్లి:** కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని, కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న అవినీతి ప్రభుత్వాలకు చరమగీతం పాడాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యమేలుతున్న కుటుంబ పాలనను తరిమికొట్టాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలంధర్‌రెడ్డి, నాయకులు లింగాల వెంకన్న, జి.లోకేష్, లకపాటి వెంకన్న, కొండ పాపయ్య, జటంగి మల్లయ్య, ఆవుల వేణు, అశోక్, సుధాకర్‌రెడ్డి, కొండ కృష్ణ, నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన



మాట్లాడుతున్న పాశం రాంరెడ్డి

**రామగిరి(నల్లగొండ):** ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన అందుతుందని తిప్పర్తి జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇండ్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, సర్పంచ్ మార్త శ్రీదేవి సైదులు, ఎస్‌ఎంసీ చైర్మన్ బత్తుల యాదగిరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పి.వీరాచారి, ఉపాధ్యాయులు కిరణ్మయి, అచ్చమ్మ, లింగమల్లు, శోభారాణి, విక్రమ్, నయామున్నీసా, సుచరిత, కాంతారెడ్డి, సాయిబాబా, మాలతి, మీనాకుమారి పాల్గొన్నారు.

# జనచైతన్య యాత్ర విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కందాల ప్రమీల

**నకిరేకల్:** బీజేపీ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా చేపట్టిన సీపీఎం జనచైతన్య యాత్ర జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల కోరారు. సోమవారం నకిరేకల్‌లో యాత్ర ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు వంటేపాక వెంకటేశ్వర్లు, మర్రి వెంకటయ్య, ప్రకాష్‌రావు, సాకుంట్ల నర్సింహ, బాలస్వామి, అంబేద్కర్, సైదులు పాల్గొన్నారు.

**యాత్రలో పాల్గొనాలి**

**మర్రిగూడ:** జనచైతన్య యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారు రిజర్వేషన్లను కోల్పోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, ఉప్పునూతల వెంకటయ్య, ఎడ్ల అంజయ్య, ఎడ్ల నరసింహ, పొలగాని రాములు, ఆవుల ముత్తయ్య పాల్గొన్నారు.

# విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**నల్లగొండ:** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని బీసీ గురుకుల పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి చెందిన సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనకు కారకులైన అధికారులపై చర్యలు చేపట్టాలని నల్లగొండలోని బీసీ గురుకుల ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ సంఘటనపై పూర్తి విచారణ చేసి బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మణనారాయణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అమిత్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్:** కానిస్టేబుల్, ఎస్సై, గ్రూప్– 4 పరీక్షలకు సిద్ధమవుతున్న దాదాపు 400 మంది అభ్యర్థులకు గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం టీఎన్‌జీఓస్ భవన్‌లో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో తిప్పర్తి జెడ్పీటీసీ సభ్యుడు పాశం రాంరెడ్డి, టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, యామ దయాకర్, ఐతగాని స్వామిగౌడ్, మందడి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రూ. 25వేల ఆర్థికసాయం**

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన కొల్లోజు రామాచారికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ఈదురుగాలుల కారణంగా రామాచారి ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో అవి ఆయన తలకు తగిలడంతో గాయాలయ్యాయి. ప్రస్తుతం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రామాచారిని ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

### కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**మునుగోడు:** టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను లీక్ చేసిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకై వారం రోజులు గడిచినా సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం మునుగోడులో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ మక్కెన అప్పారావు, మండల కన్వీనర్ రావెల అంథోని, నాయకులు ఏర్పుల సుదర్శన్, కొలను వేణుగోపాల్‌రెడ్డి, నెట్టు శ్రీకాంత్, పగడాల లింగయ్య, పాడపంగి సైదులు పాల్గొన్నారు.

### 'యానాల' ఆత్మీయ సమ్మేళనం

**నకిరేకల్:** దాదాపు 300 ఏళ్ల కిత్రం హైదరాబాద్ శివారులోని యారాల గ్రామం నుంచి వచ్చి నకిరేకల్ మండలం నెల్లి బండ గ్రామంలో స్థిరపడ్డ యనాల వంశీకులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వీరంతా తమ తాతల నాటి చరిత్రను సభావేదిక ద్వారా గుర్తు చేసుకున్నారు.




ఆత్మీయ సమ్మేళనంలో యానాల వంశస్తులు

### రేషన్ డీలర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**గుర్రంపోడు :** గుర్రంపోడు మండలంలో కలకలం సృష్టించిన నకిలీ రేషన్ కార్డుల వ్యవహారంలో రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం అధికార ప్రతినిధి రేపాకుల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు పామనగుండ్ల లాలయ్య గౌడ్‌లు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నకిలీ ఐడీ కార్డుల బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం అనుమానాలకు దారితీస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

### మర్రిగూడ ఎస్ఐగా హరీశ్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

**మర్రిగూడ:** మర్రిగూడ మండల ఎస్ఐగా హరీశ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనన మునుగోడు ఉపఎన్నిక ముందు నాంపల్లి ఎస్ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్ నుంచి విధుల్లోకి చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన సైదాబాబు నుంచి వీఆర్‌కు అటాచ్ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ హరీశ్‌రెడ్డి తెలిపారు.